
కంది: బేగంపేట్ గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఓటర్లు



ఓటేసిన అదనపు ఎస్పీ అశోక్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

# సంగారెడ్డిలో పోటెత్తిన ఓటర్లు

- బారులు తీరి ఓటుహక్కు వినియోగించుకున్న ప్రజలు
- ఉత్సహంగా ఓటు వేసిన కొత్త ఓటర్లు
- సంగారెడ్డి నియోజకవర్గంలో 70.01శాతం పోలింగ్ నమోదు
- 1,67,555 ఓట్లు పోలింగ్
- ఓటుహక్కు వినియోగించుకున్న ప్రముఖులు

సంగారెడ్డి, నవంబరు 30: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు పోటెత్తారు. గురువారం నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీ కేంద్రాల్లో ఉదయం మందకొడిగా ప్రారంభమైనా 12గంటల తర్వాత భారీగా ఓటు వేసేందుకు బారులు తీరారు. ఈసారే కొత్తగా నమోదు చేసుకున్న యువ ఓటర్లు ఉత్సాహంగా ఓటు వేసేందుకు తరలివచ్చారు. నియోజకవర్గంలో సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో క్యూలైన్‌లో నిలబడిన ఓటర్లకు ఓటు వేసేందుకు అవకాశం ఇచ్చారు. సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలో 70.01శాతం ఓటింగ్ నమోదైంది. 1,67,555 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలలో కలెక్టర్ శరత్ దంపతులు, పిల్లలతో కలిసి పట్టణంలోని పాత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ దంపతులు పాత కలెక్టరేట్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటువేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి సదాశివపేటలోని రవీంద్ర మోడల్ పాఠశాలలో చింత ప్రభాకర్, అరుణ, చింత సాయినాథ్, వినీత దంపతులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. అదనపు ఎస్పీ అశోక్ పట్టణంలోని పాత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటువేశారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యాన్ని ఈవీఎంలో నమోదు అయ్యాయి. డిసెంబర్3న అభ్యర్థుల భవిష్యత్ తేలనుంది.

### ప్రశాంతంగా పోలింగ్

కంది, నవంబర్ 30: కంది మండల పరిధిలోని 49పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఓటర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం మందకొడిగ వచ్చిన ఓటర్లు మధ్యాహ్నం వరకు ఓటు వేసేందుకు బారులు తీరారు. క్యూలైన్లో నిలబడి ఓటు వేశారు. ఎక్కడా ఎలాంటి గొడవలకు తావులేకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈవీఎంలను స్ట్రాంగ్ రూంకు తరలించారు. బ్యాతోల్‌లో జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, ఎద్దుమైలారంలో ఎంపీపీ సరళ ఓటు హక్కును వినియోగించుకున్నారు.


ఓటు వేయడానికి వెళ్తున్న ఓటర్లు


బారులుతీరిన ఓటర్లు


కంది: ఆరుట్లలో ఓటు హక్కు వినియోగించుకున్న బీఆర్ఎస్ నాయకులు



కంది: ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధుడు, ఓటేసిన యువతి


సంగారెడ్డిలో ఓటు వేసిన యువ ఓటర్లు

# బీఆర్ఎస్ వైపు ఓటర్ల మొగ్గు

- అభివృద్ధి, సంక్షేమానికి జైకొట్టిన జిల్లా ఓటర్లు
- ఐదు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం
- సైలెంట్ ఓటింగ్ దెబ్బ తీస్తుందని కాంగ్రెస్, బీజేపీలో గుబులు
- 3న గీతం యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు

సంగారెడ్డి నవంబర్ 30(నమస్తే తెలంగాణ): గురువారం సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు ముగిశాయి. జిల్లాలోని ఐదు అసెంబ్లీస్థానాల్లో ఉన్న 1609 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ముగియటంతో ఇప్పుడు అందరి దృష్టి ఎన్నికల ఫలితాలపై నెలకొంది. 3వ తేదీన జరిగే కౌంటింగ్ ఫలితాలు ఎలా ఉంటాయేమోనన్న ఉత్కంఠ అన్నివర్గాల్లో నెలకొంది. అయితే ఓటర్లు బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపుతున్నట్లు పోలింగ్ సరళి స్పష్టం చేస్తుంది. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఓటర్లుజై కొట్టారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టో ఓటర్లను ఆకర్శించింది. సంగారెడ్డి జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయంగా కనిపిస్తుంది.


కంది: బ్యాతోల్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, గ్రామస్తులు

### పక్కా వ్యూహంతో బరిలోకి బీఆర్ఎస్

సంగారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్ సీఎం కేసీఆర్ వ్యూహంతో ఎన్నికల రంగంలోకి దిగింది. ప్రతిపక్ష పార్టీలకంటే ముందుగానే సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాలకు ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించారు. అలాగే బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు చింతా ప్రభాకర్(సంగారెడ్డి), గూడెం మహిపాల్‌రెడ్డి(పటాన్‌చెరు), చంటి క్రాంతికిరణ్(అందోలు), మాణిక్‌రావు(జహీరాబాద్), భూపాల్‌రెడ్డి(నారాయణఖేడ్)లకు ముందుగానే సీఎం కేసీఆర్ బీఫామ్‌లు అందజేశారు. ఎమ్మెల్యే అభ్యర్థులపై స్పష్టత రావటంతో బీఆర్ఎస్ శ్రేణులు ఎక్కడా దారితప్పకుండా ఎన్నికల రంగంలోకి దిగారు. ప్రతిపక్షాల అభ్యర్థుల కంటే ముందుగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు గెలుపు వ్యూహాన్ని రచించి అమలుపర్చారు. సీఎం కేసీఆర్ ఐదు నియోజకవర్గాల్లో బహిరంగసభలు నిర్వహించి ఓటర్లను ఆకట్టుకున్నారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సభలు, రోడ్‌షోలు నిర్వహించి ఓటర్లను ఆకట్టుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు సైతం పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి ఓటర్ల మద్దతు కూడగట్టారు. కేసీఆర్ రూపొందించిన మ్యానిఫెస్టోతోఓటర్లను తమవైపు తిప్పుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రచారం, అభివృద్ధి పనులు, కేసీఆర్ చరిష్మా అన్ని కలిసి ఎమ్మెల్యే అభ్యర్థులు గెలుపు వైపుకు దారితీయనున్నాయి.

### కాంగ్రెస్ ఆశలు గల్లంతు!

ఎన్నికల బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారంలో వెనకబడటంతోపాటు కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ప్రజలు విశ్వసించలేదు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు ఎన్నికల ప్రచార సమయంలో ఓటర్లకు సాధ్యం కాని హామీలను ఇవ్వటంతోపాటు తాము అధికారంలోకి వస్తే తమకు పెద్ద పదవులు వస్తాయని ఎలాగైనా గెలిపించాలని ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ హామీలను ఓటర్లు నమ్మలేదు. కాంగ్రెస్ అభ్యర్థులు చివరగా జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఓటర్లను ప్రలోభపెట్టి ఎన్నికల్లో గెలిచే ప్రయత్నం చేశారు. ఎన్నికలకు ఒకరోజు ముందు ఓటర్లకు మద్యం, డబ్బులు ఎరగా వేసి ఎన్నికల్లో గెలవాలని కుయుక్తులు పన్నారు. అయితే ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థుల ప్రలోభాలకు తలొగ్గలేదు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థులు బీజేపీ ఓట్లు చీలుస్తుందని, సైలెంట్ ఓటింగ్ కలసివస్తుందని ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలోని ఓటర్లు కాంగ్రెస్ ఆశలను గల్లంతు చేస్తూ బీఆర్ఎస్ అభ్యర్థుల వైపు మొగ్గుచూపారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థులు 3వ తేదీన తమ భవితవ్యం ఏమవుతుందోనని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.